క్లుప్తంగా

కదిలిన యంత్రాంగం

● బావుల వద్ద రక్షణ కంచెల ఏర్పాటు


ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తున్న ఎస్సై అనిల్

సాక్షి ఎఫెక్ట్..

మాచారెడ్డి : మండలంలోని మైసమ్మ చెరువు తండా నుంచి సోమారంపేట గ్రామానికి వెళ్లే రహదారి పక్కన ఉన్న ప్రమాదకర బావులపై ఈ నెల 20 న 'ఈ బావులు ప్రమాదాలకు నిలయాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి పోలీసు అధికారులు స్పందించారు. సోమవారం మాచారెడ్డి ఎస్సై అనిల్ ప్రమాదకరంగా ఉన్న బావుల వద్ద కడీలు పాతించి ఇనుప ముళ్ల కంచెను ఏర్పాటు చేయించారు. దీంతో ఎన్నో రోజులుగా ఇబ్బంది పడుతున్న తమకు 'సాక్షి' అండగా నిలిచి సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు పలువురు అభినందనలు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద సోమవారం సీఎం సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ పటేల్, నిజాంసాగర్ మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు అడ్వొకేట్.రాంరెడ్డి, సాయిలు,దత్తు తదితరులున్నారు.

పోచారంలో మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం


మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు


నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారంలో సోమవారం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం గ్రామంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. దీంతోపాటు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి సైతం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటం ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు తొంట సాయిలు, నాయకులు కుంటోళ్ల యాదయ్య, కుంటోళ్ల రాజు, రాజుపేట రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల అందజేత


రంజాన్ కిట్లను అందిస్తున్న సాయితేజ

రాజంపేట: మండల కేంద్రంలో సోమవారం బల్లఆంజనేయులు ఆధ్వర్యంలో ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది ముస్లిం కుటుంబాలకు బియ్యం, పప్పు, నూనె, చక్కెర, షేమియా తదితర వస్తువులతో కూడిన రూ. 2 లక్షల విలువ గల రంజాన్ కిట్లను పేద ముస్లిం కుటుంబాలకు బల్ల సాయితేజ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుర్రాల రవికుమార్, జింక భాస్కర్, తోడెంగల ఆశయ్య, మీర్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో నైపుణ్యం


బోధనను పరిశీలిస్తున్న హెచ్‌ఎం గోపాల్

రామారెడ్డి : కృత్రిమ మేధ (ఏఐ) వెనుకబడిన విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని రామారెడ్డి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గోపాల్ రావు అన్నారు. సోమవారం 3,4,5వ తరగతుల విద్యార్థులకు ఏఐ ద్వారా పాఠ్యాంశాలను బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు పాల్గొన్నారు.

అసైన్డ్ భూమిలో క్వారీ

- బాన్సువాడ మండలం వాసుదేవ్‌పల్లి శివారులో..
- నిబంధనలకు విరుద్ధంగా ఎన్‌వోసీ ఇచ్చిన రెవెన్యూ అధికారులు
- చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి


పంట పొలాల పక్కనే ఉన్న క్వారీ


అసైన్డ్ భూముల్లో కొనసాగుతున్న కంకర క్వారీ

బాన్సువాడ : బాన్సువాడ మండలం వాసుదేవ్‌పల్లి శివారులోని సర్వే నంబరు 63/9/1 లో 20.30 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈభూములను పేద ప్రజలకు అసైన్డ్ చేశారు. ప్రస్తుతం ఈ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా క్వారీ, స్టోన్ క్రషర్ కొనసాగిస్తున్నారు. క్వారీ ఏర్పాటుకు భూములు ఇస్తే ఎంతోకొంత నగదు వస్తుందని నిర్వాహకులు గతంలో భయపెట్టారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులను ఆభూములను అప్పగించారు. మామూళ్లకు ఆశపడి రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూముల్లో క్వారీల తవ్వకాలకు అనుమతులు మంజూరు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వేయర్లు లేక క్వారీల తనిఖీలు చేపట్టడం లేదు. దీంతో కంకర తరలింపుపై లెక్కలు తెలియడం లేదు. బండరాళ్లు తవ్వడం కోసం క్వారీ యజమానులు పేలుడు పదార్థాలను ఇష్టారీతిన ఉపయోగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పేలుళ్ల దాటికి భారీ బండరాళ్లు పంట చేలలోకి వచ్చి పడుతున్నాయి. క్వారీల చుట్టుపక్కల శివారు పొలాలు గల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఇళ్లు పగుళ్లు ఏర్పాడుతున్నాయి. కంకర తరలించే వాహనాలతో వాసుదేవ్‌పల్లి శివారులోని రోడ్లు గుంతలమయంగా మారాయి. బ్లాస్టింగ్ విషయంలో క్వారీ యజమానులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వకుండానే పనులు చేస్తున్నారు. గనుల శాఖ పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి.

నిబంధనలపై పట్టింపేది..?

బాన్సువాడ, నస్రుల్లాబాద్, బిచ్కుంద మండలాల్లో క్వారీలు ఉన్నాయి. వాసుదేవ్‌పల్లి శివారులో 20 ఎకరాల విస్తీర్ణంలో ఓ క్వారీ నిర్వహిస్తున్నారు. ఐదు హెక్టార్లకు మించి విస్తీర్ణంలో ఉంటే రాష్ట్ర స్థాయి అధికారులు, అంతకంటే తక్కువగా ఉంటే క్వారీల నిర్వహణకు కలెక్టర్, ఆర్డీవో, కాలుష్య నియంత్రణ మండలి, డీఎఫ్‌వోలతో పాటు మరో 12 మంది అధికారులు పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటేనే అనుమతులు జారీ చేస్తారు. సదరు భూములు సాగుకు యోగ్యంగా లేవని, అసైన్డ్ కావని, తహసీల్దార్ ఎన్‌వోసీ జారీ చేస్తారు. క్వారీలు గ్రామాలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు లేవని కాలుష్య నియంత్రణ మండలి ఈసీ ఇచ్చిన తర్వాతే తవ్వకాలు ప్రారంభించాలి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్‌వోసీ ఇవ్వలేదు

తాను విధుల్లో చేరినప్పటి నుంచి బాన్సువాడ మండలంలోని క్వారీల ఏర్పాటుకు ఎలాంటి ఎన్‌వోసీ ఇవ్వలేదు. క్వారీలు తనిఖీ చేసి, ఏ సర్వే నంబరు భూమిలో ఏర్పాటు చేశారో పరిశీలిస్తాం. అసైన్డ్ భూముల్లో రైతులు పంటలు సాగు చేసుకోవాలి. కంకర క్వారీలకు మైన్స్ అధికారులు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

–వరప్రసాద్, తహసీల్దార్, బాన్సువాడ

ప్రతి విద్యార్థి సేవాభావాన్ని కలిగి ఉండాలి


మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సేవా గుణం పెంపొందుతుందని డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండలంలోని పోచారంలో సోమవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో భాగంగా వారంరోజులపాటు గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి సేవాభావాన్ని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏరువాకకేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ అనిల్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శివాని, డాక్టర్ ఉపేందర్, జీపీ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు


డీఈకి ఫిర్యాదు చేస్తున్న రైతులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు వచ్చినట్లు డీఈ విజయసారథి తెలిపారు. అడివిలింగాల గ్రామానికి చెందిన ఒకరు తమ ఇంటి మీదుగా వెళ్తున్న విద్యుత్‌తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని తొలగించాలని ఫిర్యాదు చేశారు. నాగిరెడ్డిపేట మండలంలో ఓరైతు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

కామారెడ్డి టౌన్ : మిషన్ భగీరథ పైపుల ద్వారా నీటిని సరఫరా చేయాలని మున్సిపల్ పరిధిలోని 18వ వార్డు భవానినగర్ కాలనీవాసులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో డీఈ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో నాలుగేళ్ల క్రితమే ఇంటింటా కుళాయిల కనెక్షన్‌లు ఇచ్చారని నీటి సరఫరా కావడం లేదని వారు వాపోయారు. కార్యక్రమంలో కాలనీవాసులు మల్లేష్, నాగరాజు, ప్రవీణ్ తదితరులున్నారు.

నేషనల్ హైవేపై యూటర్న్‌లు ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందిస్తున్న గోపాల్‌పేట గ్రామస్తులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలకేంద్రం గోపాల్‌పేటలో ఏర్పాటుచేస్తున్న నేషనల్ హైవేపై అక్కడక్కడ మూడుచోట్ల యూటర్న్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం చేపడుతున్న నేషనల్ హైవేతో గ్రామం రెండుగా చీలిపోతుందని, దీంతో ఒకవైపు నుంచి మరోవైపునకు వెళ్లే వీలుండదని వారు చెప్పారు. ఈ క్రమంలో గ్రామంలోని పెట్రోల్‌బంకు నుంచి తహసీల్ కార్యాలయం వరకు మూడుచోట్ల యూటర్న్‌లు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

సంక్షిప్తం

పౌష్టికాహారం తీసుకోవాలి

నిజాంసాగర్(జుక్కల్): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలని నిజాంసాగర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ అన్నారు. సోమవారం మండలంలోని బ్రాహ్మణపల్లి, వెల్గనూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మీ, వినోద తదితరులున్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాల కోసం రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి అనిల్ కుమార్ తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ, రెండు ఫోటోలు, జతపరిచి దరఖాస్తులు పూర్తి చేసి వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. లింగంపేట మండలానికి చేతి పంపులు ఐదు, తైవాన్ పంపులు ఐదు, రోటోవేటర్ మూడు, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్ ఒకటి, కల్టివేటర్, ప్లవ్ 4 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎల్లారం గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చినట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. మండలంలో ఎల్లారం గ్రామం పైలట్ గ్రామంగా ఎంపిక కావడంతో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నాలుగు ఇళ్లకు మార్కింగ్ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనులను కొనసాగించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో పారిశుద్ధ్య పనులను కొనసాగించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండలంలోని పోచారం జీపీ కార్యాలయన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలురికార్డులను ఆయన పరిశీలించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

మాచారెడ్డి : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. పాల్వంచ మండలం ఎల్పుగొండ గ్రామానికి చెందిన విస్లావత్ బల్‌రాం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై అనిల్ సెల్‌ఫోన్ రికవరీ చేసి సోమవారం బాధితుడికి అందించారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



బాన్సువాడ రూరల్: మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం అర్హులైన దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను బాన్సువాడ ఎంఈవో నాగేశ్వరరావు పంపిణీ చేశారు. అంధులైన పలువురు విద్యార్థులకు సెల్‌ఫోన్‌లు, చేతికర్రలు పంపిణీ చేశారు. వీరికి అలీమ్‌కో సంస్థ ఉపకరణాలను అందజేస్తుందన్నారు.కార్యక్రమంలో ఐఈఆర్‌పీ వెంకటపద్మ, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ అనిల్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన



మద్నూర్(జుక్కల్): వేసవిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండ జాగ్రత్తలు తీసుకోవాలని డోంగ్లీ పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ అన్నారు. డోంగ్లీ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వడదెబ్బ నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలున్నారు.

క్రైడా అధ్యక్ష పోటీకి నామినేషన్ దాఖలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్(క్రైడా) నూతన కార్యవర్గ ఎన్నికల సందర్భంగా సోమవారం స్థానిక కార్యాలయంలో ఎన్నికల ఇన్‌చార్జీలు నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష పోటీకి గణగోన లక్ష్మినర్సాగౌడ్ నామినేషన్‌ను దాఖలు చేశారు. ఏప్రిల్ 13న ఎన్నికలు జరుగనున్నట్లు ఎన్నికల సహాయకులు శ్రీధర్, రవి, శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపారు.

ఎల్బీనగర్ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

కామారెడ్డి టౌన్: కార్పొరేటర్ సుజాతను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సు.దీర్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి చైర్మన్ రాణా ప్రతాప్ రాథోడ్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు నునావత్ గణేష్ నాయక్‌లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ద్విచక్ర వాహనం నడుపుతున్న ప్రతి వాహన దారుడు తప్పని హెల్మెట్ ధరించాలని ఏఎస్సై సాగర్ సూచించారు. సోమవారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు గంప గోవర్ధన్ పరామర్శ



భిక్కనూరు/దోమకొండ : భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో రెండు రోజుల క్రితం తిప్పని అశోక్ మృతి చెందాడు. ఈకుటుంబాన్ని మాజీఎమ్మెల్యే గంప గోవర్ధన్ సోమవారం పరామర్శించారు. దోమకొండ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సిరికొండ శంకర్ తండ్రి రాజేశం ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


తాడ్వాయిలో పనులను ప్రారంభిస్తున్న నాయకులు


చిన్నమల్లారెడ్డిలో ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

తాడ్వాయి/కామారెడ్డి రూరల్ : తాడ్వాయి మండలంలో బీసీ కాలనీలో రూ. 20లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.20 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బీజేపీ నాయకులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్ట్


పిట్లంలో ఆశా కార్యకర్తలను అరెస్ట్ చేసిన పోలీసులు


ఎల్లారెడ్డిలో ..

తాడ్వాయి/ఎల్లారెడ్డిరూరల్/పిట్లం/ లింగంపేట/ కామారెడ్డి టౌన్ : ఆశా కార్యకర్తలను పోలీసులు సోమవారం ఉదయం పలు చోట్ల అదుపులోకి తీసుకున్నారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని హైదరాబాద్‌లోని ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడికి బయలుదేరిన ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి శాంతియుత నిరసనకు బయలుదేరిన తమను అరెస్ట్ చేయడం సరికాదన్నారు.

తెలంగాణ భవన్‌లో ఇఫ్తార్ విందు


కేటీఆర్‌కు పండ్లు తినిపిస్తున్న ముజీబొద్దీన్

కామారెడ్డి క్రైం: రంజాన్ మాసం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు సోమవారం నిర్వహించారు. కేటీఆర్ అధ్యక్షతన జరిగిన ఈ విందులో కామారెడ్డి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ పాల్గొన్నారు. కేటీఆర్ కు పండ్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ హోం మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మెన్ సలీం, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు


లింగంపేటలో మాట్లాడుతున్న వైద్యురాలు

నిజాంసాగర్/లింగంపేట : క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దని వైద్యులు రోహిత్ కుమార్, హిమబిందు అన్నారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా నిజాంసాగర్ పీహెచ్‌సీలో వైద్యులు రోహిత్ కుమార్, లింగంపేట పీహెచ్‌సీలో హిమబిందు మాట్లాడారు. క్షయ వ్యాధి నిర్మూలనకు వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీడీసీ చైర్మన్‌గా ముదాం సత్యం


సత్యంను అభినందిస్తున్న గ్రామస్తులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ముదాం సత్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ...గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు, వివిధ కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సమాచారం..

రేపు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021 నుంచి 2024 వరకు బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసిన వారితో పాటు ప్రస్తుతం ఫైనలియర్ చదువుతున్న వారు సైతం ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఎంఎస్‌ఎన్ ఫార్మా కంపెనీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు రాజంపేట తైబజార్ వేలం పాట

రాజంపేట : డీఎల్‌పీవో ఆదేశాల మేరకు మంగళవారంఎంపీడీవో రఘురాం అధ్యక్షతన మండల కేంద్రంలో తైబజార్ వేలం పాట నిర్వహించనున్నట్లు జీపీ కార్యదర్శి అశోక్ సోమవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వేలం పాటదారులు ఉదయం 10 గంటలకు జీపీ కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

రేపు గాంధారి తైబజార్..

గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి తైబజార్, దాఖలా చిట్టీ వేలం పాటను బుధవారం జీపీ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు నిర్వహిస్తామని జీపీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ. ఒక లక్ష, దాఖలా చిట్టీ వేలంలో పాల్గొనే వారు రూ.25 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

పెద్దమల్లారెడ్డి గ్రామంలో..

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో తైబజార్ వేలంపాటను బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు జీపీ కార్యదర్శి లక్ష్మి తెలిపారు. ఆసక్తిగల వారు ఈ వేలం పాటలో పాల్గొనాలని ఆమె కోరారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శ్రీ గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణాన్ని అర్చకులు వైభవంగా జరిపించారు. ఈకార్యక్రమంలో భాగంలో రాత్రి నిర్వహించిన రథోత్సవం ఆకట్టుకుంది. భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజయ్య, మాజీ చైర్మన్ సర్పారెడ్డి, మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, వేద బ్రాహ్మణులు సంతోష్‌కృష్ణ శర్మ, రామకృష్ణ శర్మ, హరికృష్ణ శర్మ, శివకృష్ణ శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోతాయిపల్లిలో పెద్దమ్మ, పెద్దిరాజుల..


పోతాయిపల్లిలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోతాయిపల్లిలో పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నిర్మాణం చేపట్టిన పెద్దమ్మ ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ముదిరాజ్ కులస్తులు మొక్కులు తీర్చుకున్నారు.

జంగంపల్లి గ్రామంలో..


జంగంపల్లిలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో వనదుర్గ ఆలయ ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణాన్ని అర్చకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ఒడి బియ్యంను కట్నకానుకలను సమర్పించుకున్నారు. రాత్రి మహిళలు అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు తీశారు.

వీరభద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని మీసాన్‌పల్లి గ్రామంలో సోమవారం వీరభద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శేఖరప్ప, గ్రామపెద్దలు తదితరులున్నారు.

రేపటి నుంచి ప్రభుస్వామి ఉత్సవాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయ్యపల్లి గ్రామ శివారులోని ప్రభుస్వామి ఆలయంలో బుధవారం నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 26న ఉదయం పూజా కార్యక్రమం, సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శన, 27న భజన, పల్లకీ సేవ, రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే బోనాల్ గ్రామంలోని ప్రభుస్వామి ఆలయంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.